RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily



Wanted Reporters
తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను
తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ గురువారం-10- 9- 2026 సంపుటి : 6 సంచిక : 214 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

### ప్రజా సమస్యలపై చర్చించాలనుకున్న ప్రభుత్వ ప్రయత్నాన్ని

# ఫాంహౌస్‌లోనే కుట్ర..



**శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించాలనుకున్న ప్రభుత్వ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఆధ్వర్యంలో పన్నిన కుట్రలో భాగంగానే.. బీఆర్ఎస్ సభ్యులు అధికారులపై దాడులు చేయడంతోపాటు శాసనసభ స్పీకర్‌ను, ఆయన తల్లిని అవమానపరిచారని తెలిపారు.**

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉసిగొల్పిన కేసీఆర్
- ఉన్మాదంతో వ్యవహరించిన బీఆర్ఎస్ సభ్యులు
- కుల, జాతి వివక్షతో అశాంతి సృష్టించాలనుకున్నారు
- సభాపతి మనసును గాయపరచడమే వారి లక్ష్యం
- దళితులు తిరిగిన నేలను శుద్ధి చేస్తారా?
- ఖర్గే విషయంలోనూ ఇలాగే వ్యవహరించారు
- ఫాంహౌస్ కుట్రలపై దర్యాప్తుకు ఆదేశిస్తున్నాం
- జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌కు బాధ్యతలు
- కుట్రదారులు, పాత్రధారులకు శిక్షలు తప్పవు
- ఆ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేయాలి
- కాంగ్రెస్ పార్టీ అంటేనే కోట్లాది ప్రజలకు భరోసా
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్,**అభ్యుదయం**
సభాపతికి జరిగిన అవమానంపై డప్పు దరువు ద్వారా నిరసన తెలిపేందుకు వెళ్లిన దళిత సంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామికవాదులపైనా దాడులు చేశారని మండిపడ్డారు. పైగా, దళితులు తిరిగిన నేలను శుద్ధి చేసి.. తీవ్రమైన నేరానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వరుస ఘటనలు చూస్తుంటే పథకం ప్రకారమే జరిగినట్లు కనిపిస్తోందన్నారు. ఈ అన్ని ఘటనలపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయని, ఈ కేసుల దర్యాప్తు బాధ్యతలను హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయకుమార్‌కు అప్పగిస్తున్నామని చెప్పారు. బుధవారం స్పీకర్‌పై బీఆర్ఎస్ సభ్యుల దూషణలపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంటే దేశంలో కోట్లాది మంది ప్రజలకు, తాడిత, పీడిత వర్గాలకు ఒక విశ్వాసం, భరోసా అని అన్నారు. వివిధ సమూహాల కలయిక అయిన భారతదేశంలో దళితులు, మహిళలు, ఆదివాసీల గౌరవాన్ని

మిగతా 2లో

### కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారానికి

# తెలంగాణ ప్రజలే బుద్ధి చెప్తారు

- ప్రశ్నలకు బదులివ్వలేకనే సస్పెన్షన్
- ప్రజాసమస్యల నుంచి పలాయనం
- మైకులు ఆపినా ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పోరాటం ఆగదు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో హిట్లర్ నియంతృత్వ పోకడలు
- నిర్బంధం పెరిగితే తిరుగుబాటే- బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు



హైదరాబాద్,**అభ్యుదయం**
శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులపై వేటు వేయడం అంటే ప్రతిపక్షాన్ని సస్పెండ్ చేయడం కాదని, తెలంగాణ ప్రజలగొంతు నొకడమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ టీ హరీశ్‌రావు పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు అంటే ప్రతిపక్షాన్ని వేధించడం, టార్గెట్ చేయడం కాదని, ప్రజల సమస్యలపై లోతుగా చర్చించి పరిష్కారం చూపడం అని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మూడు రోజులుగా సాగుతున్న

మిగతా 2లో

## గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు



2లో

- కళాశాలను ఏర్పాటు చేసింది టీడీపీ.. నిర్వీర్యం చేసింది వైసీపీ
- ఆరు నెలల్లో 253 బోధనా పోస్టుల భర్తీ.. వీసీఐ అనుమతుల పునరుద్ధరణ
- వైసీపీ నేతలు ముందు తమ ఐదేళ్ల పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలి:
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

# స్టైఫండ్ డబుల్..

మిగతా 2లో



- ఆయుష్ విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్
- స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ
- సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్.
- జీవో కాపి అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదారాబాద్, **అభ్యుదయం**
ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34,385 నుంచి 74,482కు పెరిగింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు బుధవారం

# 'దళిత స్పీకర్' పేరిట కాంగ్రెస్ రాజకీయాలు



- కేసీఆర్‌ను హత్యచేసేందుకు రేవంత్ సర్కార్ కుట్ర
- అసెంబ్లీ వ్యవహారాలు, ఘటనలపై గవర్నర్‌కు చెప్పాం
- ప్రతి అంశంపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు
- న్యాయం జరుగకుంటే జాతీయ సంస్థలను ఆశ్రయిస్తం
- గవర్నర్ శుక్లాను కలిసిన అనంతరం మీడియాతో బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్

హైదరాబాద్, **అభ్యుదయం** : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యలు, శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల చర్యలు, కేసీఆర్ నివాసంపై దాడి వంటి అంశాలను గవర్నర్ శివప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లినట్టు బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు వెల్లడించారు. శాసనసభా వ్యవహారాలతోపాటు బయట జరిగిన ఘటనలపైనా విచారణ జరిపిస్తామని గవర్నర్ తమకు హామీ ఇచ్చారని, రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యకాండలో ఆయన జోక్యం చేసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో న్యాయం జరుగకపోతే జాతీయ స్థాయి సంస్థలను ఆశ్రయిస్తామని తేల్చి చెప్పారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో బుధవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను పార్టీ ప్రతినిధులతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ వ్యవహారాలతోపాటు సభ వెలుపల జరిగిన ప్రతి ఘటనను, కేసీఆర్ ఇంటిపై దాడి వంటి అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. పలు అంశాలపై ఫిర్యాదు చేశారు.విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. అనంతరం లోక్‌భవన్ బయట మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాము గవర్నర్‌ను కలిశామని తెలిపారు.

**'దళిత స్పీకర్' పేరిట కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నది. శాసనమండలి సభ్యులు అనని మాటలను అన్నట్టుగా చిత్రీకరిస్తున్నారు.**

- మిగతా 2లో పేజీలో



## నిజం గెలిచింది... నీతి నిలిచింది

- చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు
- కుట్రపూరితంగా 53 రోజుల నిర్బంధం
- టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్

2లో




### ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో

## ఏపీ వక్ఫ్ బోర్డుకు స్థానం

- తాలీమ్-ఎ-హునర్ కు అంతర్జాతీయ గుర్తింపు
- అధికారికంగా రికార్డ్ హోల్డర్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు
- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

## నిజం గెలిచింది... నీతి నిలిచింది

అమరావతి,సరిగ్గా మూడేళ్ల క్రితం ఇదే రోజు రాజకీయ దురుద్దేశంతో జగన్ కుట్రపూరితంగా పెట్టించిన తప్పుడు కేసులో చంద్రబాబు ని అర్ధరాత్రి వేళ అరెస్టు చేశారు. 53 రోజులు పాటు జైలులో నిర్బంధించారు. నాటి చీకటి రోజును నిరసిస్తూ నిజం గెలిచింది నినాదంతో ఉండవల్లి నివాసంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ 53 కొవ్వొత్తులు వెలిగించారు. ఐదు దశాబ్దాల నిస్వార్ధ రాజకీయ విలువల శిఖరం నారా చంద్రబాబునాయుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది తెలుగు ప్రజల ఆశీస్సులతో కడిగిన ముత్యములా తప్పుడు కేసుల నుంచి బయటకు వచ్చారని లోకేష్ పేర్కొన్నారు. ప్రజా బలమే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు కి శ్రీరామరక్ష అని ధీమా వ్యక్తం చేశారు.

## స్టైఫండ్ డబుల్..

మధ్యాహ్నం, సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీఓ కాపీని అందజేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆయుష్ విద్యార్థులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ఇప్పుడు అల్లోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదిగి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. యువతే దేశ భవిష్యత్తు.. విద్యార్థులే భావి పౌరులు అని మంత్రి అన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజంలో గుణాత్మక మార్పుకు విద్య పునాది అని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల్లో 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి, ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు. సిద్దిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేసి, ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ హాస్పిటల్ ద్వారా ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆయుష్ వైద్య విధానాలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా విద్యార్థులు, యువ వైద్యులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త చికిత్సా విధానాలు, ఔషధాలపై పరిశోధన చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. “మీరు చదువుతో ఆగిపోవద్దు.. పరిశోధన వైపు కూడా అడుగులు వేయాలి. మన సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ వైద్యులపై ఉంది” అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆయుష్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారానికి తెలంగాణ ప్రజలే బుద్ధి చెప్తారు

సమావేశాల్లో ఒక ప్రజా సమస్యపైనైనా సమగ్ర చర్చ జరిగిందా? ఏ ఒక ప్రభుత్వ విధానంపైనైనా స్పష్టత ఇచ్చారా? అని ప్రశ్నించారు.

సభలో తమ గొంతు వినిపించాలంటూ వేల మంది వినతులు

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నాయని తెలిసి రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎన్నో ఆశలతో తమను కలిసి వందలాది వినతిపత్రాలు అందజేశారని హరీశ్‌రావు వెల్లడించారు. తమ బాధలను, సమస్యలను శాసనసభ వేదికగా లేవనెత్తాలంటూ ప్రజలు, ఉద్యోగులు, యువకులు నిరంతరం ఫోన్లు చేస్తూ మెసేజ్‌లు పెడుతున్నారని తెలిపారు. ప్రజలు తమ గొంతును అసెంబ్లీలో వినిపించాలని ప్రాధేయపడుతుంటే, చర్చ జరగకుండా తమను బలవంతంగా బయటకు పంపించి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనలో తీవ్ర ఇకట్లకు గురవుతున్నారని ఆరోపించారు.ఙాశీశ్రీఠఱఎం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ఎప్పుడు పూర్తి చేస్తారని ఆర్టీసీ కార్మికులు, నిషేధిత జాబితా నుంచి తమ భూములను ఎప్పుడు తొలగిస్తారని రైతులు, జీవో 97ను ఎప్పుడు రద్దు చేస్తారని పాలిటెక్నిక్ విద్యార్థులు నిలదీస్తున్నారని పేర్కొన్నారు. వీటితోపాటు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు, డీఏ, పీఆర్సీ కోసం ఉద్యోగులు, కారుణ్య నియామకాల కోసం సింగరేణి కార్మికులు, పెన్షన్ల పెంపు కోసం వృద్ధులు కండ్లల్లో ఒత్తులు వేసుకొని చూస్తున్నారని, ఈ అంశాలన్నీ సభలో ప్రస్తావనకు వస్తే జవాబు చెప్పలేమన్న భయంతోనే ప్రభుత్వం తమను సస్పెండ్ చేసి పారిపోయిందని దుయ్యబట్టారు. మైకులు కట్ చేసినా.. ప్రజాక్షేత్రంలో గొంతును నొకలేరుశాసనసభలో మైకులు కట్ చేసి, సభ్యులను సస్పెండ్ చేసి బలవంతంగా గొంతు నొకవచ్చేమో గానీ ప్రజాక్షేత్రంలో తమ గళాన్ని ఆపడం ఎవరి తరమూ కాదని హరీశ్‌రావు స్పష్టంచేశారు. ప్రభుత్వం ఎంతగా అణచివేయాలని చూస్తే, ప్రజాసమస్యలపై బీఆర్‌ఎస్ పార్టీ రెట్టింపు ఉత్సాహంతో పోరాడుతుందని తేల్చిచెప్పారు.

## గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

అమరావతి, గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు లభించకపోవడంపై వైసీపీ నేతలు మాట్లాడటం చూస్తుంటే... అసలు వారికి ఆ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఎవరు ఇచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కళాశాల అభివృద్ధిని పట్టించుకోని వారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రజలకు మెరుగైన పశువైద్య సేవలు అందించడంతో పాటు, ఈ ప్రాంతంలో వెటర్నరీ విద్యను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో గరివిడిలో వెటర్నరీ కళాశాలను ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అని అచ్చెన్నాయుడు తెలిపారు

2017 ఏప్రిల్‌లో రూ.81.72 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని, 2018 ఫిబ్రవరిలో సుమారు 90 ఎకరాల భూమిని కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన ఐదేళ్ల సమయం అధికారంలో ఉన్న వైసీపీ ఏం చేసింది? అని మంత్రి నిలదీశారు. ఐదేళ్లలో ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా?అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చారా? వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించారా? నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారా? కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారా? ఈ ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.2024 ఆగస్టు నాటికి పూర్తికావాల్సిన నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని స్పష్టం చేశారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ప్రధాన లోపాలు లేవని తాజా వీసీఐ పరిశీలన స్పష్టం చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్లినికల్ కాంప్లెక్స్, బాలురు, బాలికల వసతిగృహాల నిర్మాణ పనులను పూర్తి చేసిందన్నారు. వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా దాదాపు 99 శాతం మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని తెలిపారు .కళాశాలలో సిబ్బంది కొరతను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తం 253 బోధనా పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి పొందామని మంత్రి తెలిపారు. ఇప్పటికే వీసీఐ సూచనల మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి మొత్తం బోధనా సిబ్బంది సంఖ్యను 77కు పెంచామని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రెగ్యులర్ నియామక ప్రక్రియలో ఆలస్యం జరిగిందని, అయితే ఆరు నెలల్లో నియామక ప్రక్రియను పూర్తి చేసి వీసీఐ అనుమతులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం గత ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మంత్రి మండిపడ్డారు. గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైన బోధనా సిబ్బంది నియామకాలను పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఇకనైనా వైసీపీ నేతలు విమర్శలు చేసే ముందు తమ ఐదేళ్ల పాలనను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అచ్చెన్నాయుడు సూచించారు.

## ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఏపీ వక్ఫ్ బోర్డుకు స్థానం

అమరావతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చరిత్రలో మరో అరుదైన ఘనత నమోదైంది. పేద, ప్రతిభావంతమైన ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించేందుకు చేపట్టిన ప్రతిష్టాత్మక తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమాన్ని గుర్తిస్తూ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును అధికారికంగా రికార్డ్ హోల్డర్ గా ప్రకటించింది. మోస్ట్ మెరిటోరియస్ స్టూడెంట్స్ గాట్ ఫ్రీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ (మాస్) విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు పేరును సంస్థ తన అధికారిక రికార్డుల్లో నమోదు చేసి, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లోనూ ప్రచురించింది. ఈ సందర్భంగా ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, వక్ఫ్ బోర్డు విద్యా రంగంలో చేపట్టిన తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు రావడం ఎంతో గర్వకారణం.

ఆర్థిక పరిస్థితి కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల కలలు ఆగిపోకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇప్పుడు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఏపీ వక్ఫ్ బోర్డు అధికారిక రికార్డ్ హోల్డర్‌గా స్థానం సంపాదించడం మా కృషికి లభించిన గొప్ప గుర్తింపు అని తెలిపారు. ఈ విజయం కేవలం వక్ఫ్ బోర్డుదే కాదు. తాలీమ్-ఎ-హునర్ ద్వారా కొత్త భవిష్యత్తును నిర్మించుకుంటున్న ప్రతి విద్యార్థిదీ. ఈ గుర్తింపు మాపై మరింత బాధ్యతను పెంచింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టి పేద, ప్రతిభావంతమైన విద్యార్థులకు అండగా నిలుస్తాం అని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు.

## ప్రజా సమస్యలపై చర్చించాలనుకున్న ప్రభుత్వ ప్రయత్నాన్ని ఫాంహౌస్‌లోనే కుట్ర..

నిలబెట్టేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగా నడుస్తున్న ప్రజాస్వామ్య వ్యవస్థ మనదని పేర్కొన్నారు.కాంగ్రెస్ ఏం చేసిందని అడిగేవారు.. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో పరిస్థితులను ఒకసారి పరిశీలించాలని సీఎం రేవంత్ అన్నారు. భారతదేశం అభివృద్ధి చెందేలా కాంగ్రెస్ దూరదృష్టితో ఎలాంటి చర్యలు తీసుకుందో వారికి అర్థమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. ఆ రిజర్వేషన్ల ద్వారా రాష్ట్రపతి వరకు అవకాశం దక్కిందన్నారు. కర్ణాటకలోని ఒక చిన్న గ్రామంలో జన్మించి.. రజాకార్ల దాడుల్లో తండ్రిని కోల్పోయి, కార్మిక నాయకుడిగా రాణించి, జాతీయ స్థాయికి ఎదిగిన నేత మల్లికార్జున ఖర్గే 60 ఏళ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్నారని చెప్పారు. 85 ఏళ్ల వయసులోనూ ఈ దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలపై పోరాడుతున్న ఖర్గే.. ఉత్తరాఖండ్‌లో ఒక నిరసన సభలో పాల్గొంటే.. బీజేపీ అనుబంధ సంస్థ అయిన శ్రీరామ్‌సేన సభ్యులు ఆ మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడం అత్యంత హేయమైన చర్య అని రేవంత్ మండిపడ్డారు. దీనిని శాసనసభ ముక్తకంఠంతో ఖండిస్తోందని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై దేశమంతటా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు ఎంపీలు రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ ఘటనను మరువక ముందే రాష్ట్రంలో మరో దురదృష్టకర సంఘటన జరిగిందన్నారు.

**సభ నడవకుండా బీఆర్‌ఎస్ కుట్ర..**

విద్యా రంగంలో సమస్యలు, ధరణి అక్రమాలు, 22ఏ రాద్ధాంతంపై శాసనసభలో చర్చించాలనుకున్నామని, ప్రతిపక్షాలు లేవనెత్తిన చాలా అంశాలపై చర్చించాలని నిర్ణయించామని సీఎం రేవంత్ అన్నారు. కానీ, ఇవేవీ జరగకుండా బీఆర్‌ఎస్ కుట్ర చేసిందని ఆరోపించారు. ఈ నెల 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుంటే.. 6వ తేదీ సాయంత్రం ఆ పార్టీ సభ్యులను కేసీఆర్ తన ఫాంహౌస్‌కు పిలిపించుకొని.. సభ జరగకుండా చేసేలా పథకం పన్నారని తెలిపారు. వారి సభ్యులను ఉన్మాదులుగా మార్చి.. సభను అడ్డుకునేందుకు ఉసిగొల్పారని చెప్పారు. సమస్యలపై చర్చ జరిగితే వారి పదేళ్ల దురాగతాలు, అప్పులపై ప్రజలకు అవగాహన కలుగుతుందని భయపడ్డారని, అదే జరిగితే తెలంగాణ ప్రజలు ఇక శాశ్వతంగా వారి పార్టీని బొందపెడతారనే చర్చ జరగకుండా కుట్ర చేశారని ధ్వజమెత్తారు. పార్లమెంటుపై దాడి చేసిన ఉగ్రవాదులకు, ఉన్మాదంతో సభాపతిని అవమానించిన వారికి పెద్దగా తేడా లేదన్నారు. ఉన్మాదానికి లోనై కొంతమంది నేతలు.. అధికారులపై దాడులు చేయడమే కాకుండా సభాపతిని అవమానించేలా వ్యవహరించారని, ఆయన తల్లిని సైతం అవమానించారని మండిపడ్డారు. రాజకీయాల్లో విభేదాలు ఉండవచ్చునని, కానీ.. వ్యక్తపరచడంలో విచక్షణ కోల్పోయి ప్రవర్తించారని తెలిపారు. దీనిపై విపక్ష నేత కేసీఆర్ సభాపతికి క్షమాపణచెప్పి.. వారి సభ్యులతో క్షమాపణ చెప్పించి.. సభ సజావుగా జరిగేలా చూస్తారని అంతా భావించారని, కానీ.. అలా జరగకపోగా వారు మరింత ఉన్మాదంతో వ్యవహరించారని విమర్శించారు.

**దళితులు నిరసన తెలపడం నేరమా?**

కుట్ర జరిగిన ఫాంహౌస్ ముందే దండోరా వేయాలని ప్రజాస్వామ్యవాదులు నిరసనకు దిగారని సీఎం రేవంత్ తెలిపారు. వారిలా ఉన్మాదానికి తెగబడలేదని, కేవలం డప్పు దరువులతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపారని చెప్పారు. తమను బానిసలుగా భావించవద్దని, సహనం కోల్పోయేలా వ్యవహరించవద్దని చెప్పేందుకే దళిత సోదరులు వెళ్లారన్నారు.

చెప్పులు కుట్టిన చేతులు రాజ్యాంగ పదవులను చేపట్టాయని, ఇంకా తమ మనసులను గాయపరచవద్దని దరువేసి మరీ చెప్పారన్నారు. ఇది నేరమెలా అవుతుందని ప్రశ్నించారు.

## ‘దళిత స్పీకర్’ పేరిట కాంగ్రెస్ రాజకీయాలు

1,000 రోజుల పాలన విఫలం

‘కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలను 100 రోజుల్లోనే అమలు చేస్తామని అధికారంలోకి వచ్చింది. 1,000 రోజులైనా వాటిని అమలుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీనిపై గవర్నర్‌కు సమగ్రంగా వివరించాం’ అని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదురొంటున్న సమస్యలను వివరించామని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై తమ వాదనను ఆయన ముందుంచామని చెప్పారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన, వారి డిమాండ్లను వివరిస్తూ, వారి ఆందోళనను పరిషరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతోపాటు, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు.

‘

దళిత స్పీకర్’ పేరిట కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నది. శాసనమండలి సభ్యులు అనని మాటలను అన్నట్టుగా మానిప్యులేషన్ చేస్తున్నారు. కేసీఆర్ ఇంటిపై దాడి, ఆయనపై హత్యాయత్నానికి ప్రభుత్వం కుట్ర చేసింది. ఈ వ్యవహారం వెనుక ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హస్తం ఉన్నది.

పోలీసుల అడ్డంకులపై ఫిర్యాదు

శాసనసభ సమావేశాల తొలిరోజు జరిగిన పరిణామాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు కేటీఆర్ వివరించారు. రాహుల్‌గాంధీ పార్లమెంటులో నిరసన తెలిపిన తరహాలోనే తాము కూడా టీషర్టులు ధరించి నిరసన వ్యక్తంచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. శాసనసభ్యులుగా తమకున్న హకులను కాలరాస్తూ, సభలోకి వెళ్లనీయకుండా పోలీసులు రోడ్డుపైనే అడ్డుకున్నారని తెలిపారు.దాష్టీకానికి పాల్పడ్డారని గవర్నర్‌కు వివరించినట్టు చెప్పారు. తమపై జరిగిన దాడికి సంబంధించిన ఫొటోలు, ఇతర ఆధారాలను గవర్నర్‌కు అందజేశామని తెలిపారు. మహిళా శాసనసభ్యులపై జరిగిన పోలీసుల దుశ్చర్యను ప్రత్యేకంగా వివరించినట్టు చెప్పారు.

# తిరుమలకు వచ్చే భక్తులకు లైఫ్ ఇన్సూరెన్స్

## టీటీడీ బోర్డు నిర్ణయం



తిరుమల : తిరుమల, తిరుపతి దేవస్థానం ( ఖణ ) బోర్డు భక్తుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోనే ఏ ఆలయంలో లేని విధంగా భక్తులకు లైఫ్ ఇన్సూరెన్స్ ను అమలు చేయాలని నిర్ణయించింది. బుధవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు.ముఖ్యంగా శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తిరుమలలో సహజ మరణం పొందితే భక్తుని కుటుంబానికి రూ.2 లక్షలు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రతో చైర్మన్ మీడియాకు వివరించారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తోందని ఆయన తెలిపారు.కలిసి ఛైర్మన్ మీడియాకు వెల్లడించారు.

ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు ముఖ్యాంశాలు తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు , అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని వివరించారు.

రిలయన్స్ సంస్థ టీటీడీకి విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని తెలిపారు. అదే కార్యక్రమంలో 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ క్యాలెండర్లు, డైరీలను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారన్నారు.

భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, తిరుమలలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అందించే బీమాను రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నామని వారు తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డా.ఎ.శరత్, శ ప్రభల గోపినాథ్, సీవీఎస్వో కే వి మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏడు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం..

### తెలంగాణకు ఒకటి.. ఏపీకి మరొకటి



దేశంలోని ఏడు కీలక రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశమైన క్యాబినెట్ కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణలో ఒక ప్రాజెక్టుకు, ఏపీలో ఒక ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు

దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బిలాస్‌పూర్-కాంతి నగరాలను కలుపుతూ ఈ ప్రాజెక్టులు ఉండనున్నాయి. ఇప్పటికే మూడు రైల్వే లైన్లు ఉన్న పలు ప్రాంతాల్లో నాలుగో లైన్ ఏర్పాటుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే రూ.2,000 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, మరో 5,000 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయని, వీటికి ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. అలాగే, మరో 4,000 కిలోమీటర్ల మేర పనులకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు.తెలంగాణకు సంబంధించి ఒక ప్రాజెక్టుకు ఆమోదం లభించింది.

ఇది ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల పొడవైన నాలుగో లైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీని విలువ రూ.2,419 కోట్లుగా ప్రభుత్వం నిర్ధరించింది. ఏపీకి సంబంధించి అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల పొడవుతో 3,4 లైన్ల నిర్మాణం జరగనుంది. మొత్తంగా దక్షిణాదికి సంబంధించి తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం అంగీకరించింది.

# పోషణ్ మహ్ -2026 గోడప్రతులను ఆవిష్కరించిన కలెక్టరు కె.వెట్రిసెల్వి

ఏలూరు, సెప్టెంబరు 09 (ఆర్ఎన్ఎ): కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా మహిళా అభివృద్ధి. శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ మహ్ -2026 గోడప్రతులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషక ఆహారంపై అవగాహన పెంపొందించడమే పోషణ్ మహ్-2026 ప్రధాన లక్ష్యమని అన్నారు. సమతుల్య ఆహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, తల్లిపాలు, చిన్నారులు ఆరోగ్యసంరక్షణ వంటి అంశాలుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పోషకాహార కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన వైద్య, పోషక సహాయం అందించాలని అన్నారు. ప్రతి కుటుంబం పోషకాహారం, ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోషణ్ మహ్-2026 సందర్భంగా జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చెయ్యాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, ఇంచార్జి డిఆర్వో, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఐసిడిఎస్ పిడి పి.శారద, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జి.వి.కె.మల్లిఖార్జునరావు, నగర పాలక సంస్థ కమిషనరు ఏ.భాను ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, డిఆర్డిఏ పిడి టి.వి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఆ బూతులు భరించలేకన కడుపు మండి మాట్లాడా!

- ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదు
- కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ

హైదారాబాద్, సెప్టెంబర్ 09: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.

ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, “ఎక్కడ సచ్చిందు రాహుల్ గాంధీ?” అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

# ఝార్ఖండ్ ఓటర్ల జాబితాలో ఆఫ్ఘనీయులు

### దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి..




జమ్‌షెడ్‌పూర్, సెప్టెంబర్ 09 ఝార్ఖండ్‌లో నిర్వహించిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో తీవ్ర దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్ల ముసాయిదా జాబితాలో ఏకంగా ముగ్గురు ఆఫ్ఘనిస్థాన్ పౌరుల పేర్లు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన, పత్రాల ధృవీకరణ సమయంలో అధికారులు ఈ వ్యత్యాసాన్ని కనిపెట్టారు. నోటీసులు జారీ చేసినప్పటికీ, వారు సరైన భారతీయ పౌరసత్వ పత్రాలను సమర్పించలేకపోయారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టులు లభించడంతో వారు విదేశీయులని నిర్ధారణ అయింది. ఝార్ఖండ్ సీఈవో కేజీ రవికుమార్ ఈ అంశాన్ని ధ్రువీకరిస్తూ, విదేశీ పౌరుల పేర్లను ఓటర్ల జాబితా నుండి తక్షణమే తొలగించినట్లు వెల్లడించారు. విదేశీ పౌరులకు భారతీయ ఓటరు కార్డులు లభించేలా వెనుకుండి సహకరించిన వ్యక్తులు, అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురి కుటుంబ సభ్యుల పత్రాలపై కూడా తనిఖీలు జరుపుతున్నామని... రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి విదేశీయుల పేర్లు నమోదయ్యాయా అన్న కోణంలో దర్యాప్తు వేగవంతం చేసినట్లు వెల్లడించారు.

# 13 రకాల విత్‌డ్రాలను 3 కేటగిరీలు

**- పీఎఫ్ అడ్వాన్స్ రూల్స్‌లో కీలక మార్పులు**

**-75 శాతం బ్యాలెన్స్ విత్‌డ్రాకు అనుమతి**




న్యూఢిల్లీ,సెప్టెంబర్ 09ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ ఖాతా నుంచి నిధుల పాక్షిక ఉపసంహరణ (అడ్వాన్స్) నిబంధనలను సంస్థ గణనీయంగా సరళీకరించింది. గతంలో అమల్లో ఉన్న 13 రకాల సంక్లిష్ట ఉపసంహరణ పద్ధతులను రద్దు చేసి, వాటి స్థానంలో కేవలం మూడు సులభతర విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నూతన నిబంధనల ప్రకారం, ఈపీఎఫ్‌లో సభ్యత్వం పొంది 12 నెలలు పూర్తి చేసుకున్న చందాదారులు తమ ఖాతాలోని నిల్వలో 75 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. అయితే, ఖాతాలో కనీసం 25 శాతం నిల్వను తప్పనిసరిగా కొనసాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ గతంలోనే ఆమోదం తెలిపింది. తాజా సవరణల ప్రకారం, ఉపసంహరణ ప్రక్రియను మూడు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు. అనారోగ్యం లేదా వైద్య చికిత్స నిమిత్తం సర్వీసు కాలంలో ఎన్నిసార్లయినా నిధులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే, చదువుల కోసం 10 సార్లు, వివాహ అవసరాల కోసం 5 సార్లు ఉపసంహరణకు అనుమతి ఇచ్చారు

. ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణాల చెల్లింపు లేదా ఇంటి మరమ్మతుల కోసం సర్వీసు మొత్తంలో ఐదుసార్లు అడ్వాన్స్ పొందే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు, సంస్థ మూసివేత, ఉద్యోగం కోల్పోవడం లేదా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు నిధులు ఉపసంహరించుకునే వెసులుబాటు కల్పించారు.

# జపాన్‌లో భారీ వరదలు

### . ఆసియా గేమ్స్‌కు ముప్పు.. అథ్లెట్స్ తరలింపు



జపాన్‌లో జరగబోతున్న ఆసియా గేమ్స్‌కు భారీ వర్షాలు, వరద ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే అక్కడ అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదవుతున్నాయి. గేమ్స్ జరిగే నగోయా ప్రాంతంలో కూడా వర్షాలు పడుతుండటంతో అథ్లెట్లను ఇక్కడి నుంచి అత్యవసరంగా మరో చోటుకు తరలించారు. దీంతో రాబోయే రోజుల్లో కూడా వర్షాలు పడితే.. ఆసియా గేమ్స్ నిర్వహణే కష్టతరమవుతుంది. దీంతో ఈ గేమ్స్ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. జపాన్‌లోని నగోయా పట్టణంలో ఆసియా గేమ్స్ సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్నాయి.

ఇందుకోసం వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు ఇప్పటికే జపాన్ చేరుకున్నారు. కొన్ని గేమ్స్‌కు సంబంధించిన పోటీలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అనేక దేశాలకు చెందిన అథ్లెట్లు జపాన్ చేరుకుంటున్నారు. 36 క్రీడలకు సంబంధించిన 503 మంది అథ్లెట్లు ఇందులో పాల్గొంటున్నారు. వీరిలో 269 మంది పురుషులు, 234 మంది స్త్రీలు ఉన్నారు. ఆసియా క్రీడలకు వేదిక కానున్న నగోయా పట్టణంలో ప్రస్తుతం భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళవారం ఒక్క గంటలోనే 104 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

దీంతో ఈ నగరలో ఉన్న వందలాది మంది అథ్లెట్లు, ఇతర క్రీడాకారుల్ని యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. కొన్ని షిప్పింగ్ కంటైనర్లలోనే క్రీడాకారులకు వసతి ఏర్పాటు చేయగా.. వారిని కూడా ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు తరలించింది. ఇక్కడి తాత్కాలిక షెల్టర్లలో 400 మంది వరకు క్రీడాకారులు, ఇతర సిబ్బంది బస చేస్తున్నారు. అయితే, వర్షాలు, వరదల వల్ల క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందీ లేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని జపాన్ అధికారులు వెల్లడించారు. అలాగే, క్రీడలు జరిగే వేదికలకు కూడా ఏ ఇబ్బందీ లేదన్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారమే క్రీడలు జరుగుతాయని స్పష్టం చేశారు.

అయితే, క్రీడాకారులకు ఏర్పాటు చేసిన వసతి ప్రదేశాల్లో కొన్ని చోట్ల నీళ్లు కురుస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. మరోవైపు నగోయా పట్టణంలోని అనేక ప్రాంతాలు నీట మునిగాయి. సబ్ వేలు, బస్సు సర్వీసుల్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ఇంకా భారీ వరద ముప్పు పొంచి ఉందని స్తానిక అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా కాళోజీ

- అణగారిన గొంతుకకు అక్షరమై.. తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమై నిలిచిన ప్రజాకవి
- కాళోజీ ఆశయాలను భావితరాలకు అందించాలి: కలెక్టర్ అంకిత్
- ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9
ప్రజల బాధను తన బాధగా భావించి.. అణగారిన వర్గాల గొంతుకను తన కలంతో ప్రపంచానికి వినిపించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి, సామాజిక చైతన్యానికి కాళోజీ చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అంకిత్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. "కాళోజీ కేవలం కవి కాదు.. ప్రజల పక్షాన నిలిచిన ఉద్యమ స్వరం" అని అభివర్ణించారు. తెలంగాణ మట్టి మనుషుల జీవితాలు, వారి కష్టాలు, కన్నీళ్లు, ఆశలు, ఆకాంక్షలను తన రచనల్లో ప్రతిబింబించిన మహనీయుడని కొనియాడారు. సామాన్యుల భాషలోనే సామాజిక సమస్యలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని రగిలించినందుకే ప్రజాకవిగా ప్రజల గుండెల్లో చిరస్థానం సంపాదించుకున్నారని తెలిపారు.

## సైబరాబాద్ పోలీస్ సొసైటీ ఎన్నికల్లో ట్రెజరర్‌గా కానిస్టేబుల్ నవీన్




అభ్యుదయం – కూకట్ పల్లి (సెప్టెంబర్ 09): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం జరిగిన పోలీస్ సొసైటీ ఎన్నికల్లో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నవీన్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. ఈ విజయంతో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు సైబరాబాద్ పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా కానిస్టేబుల్ నవీన్ మాట్లాడుతూ తన గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించే దిశగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనతో పాటు గెలుపొందిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- పీఓపీ విగ్రహాలకు బదులు మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి
- కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపు



హనుమకొండ, సెప్టెంబర్ 9
వినాయక చవితి వేడుకల్లో పర్యావరణ హితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. "మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో రూపొందించిన అవగాహన పోస్టర్‌ను బుధవారం కుడా కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. వినాయక చవితి మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. భక్తితో పండుగ జరుపుకోవడంతో పాటు ప్రకృతికి హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

### మట్టి విగ్రహాలతోనే ప్రకృతికి మేలు

మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా భక్తిని చాటుకోవడంతో పాటు చెరువులు, నదులు, ఇతర నీటి వనరులను కాలుష్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), రసాయనిక రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించేందుకు ముందుకు రావాలని కోరారు. "వినాయకుడిని మట్టితో పూజించి.. అదే మట్టిని తిరిగి ప్రకృతికి అందిద్దాం. మన భక్తి వల్ల ప్రకృతికి హాని కలగకుండా చూసుకోవడమే నిజమైన బాధ్యత" అని సుధారాణి పేర్కొన్నారు.

### భవిష్యత్ తరాల కోసం ప్రకృతిని కాపాడాలి

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించుకోవాలని సూచించారు. పర్యావరణహిత వినాయక చవితి నిర్వహణకు ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
కార్యక్రమంలో కుడా ప్రాజెక్ట్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, ఈఈ భీమారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9 జిల్లాలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినాయక చతుర్థి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి బుధవారం జిల్లా కలెక్టర్ , ఎస్పీ తో కలిసి కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటులో నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. మండపాల వివరాలను నిర్వాహకులు సంబంధిత అధికారులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలను నివారించేందుకు నాణ్యమైన విద్యుత్ వైరింగ్, తగిన భద్రతా పరికరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు క్రేన్లు, తగిన లైటింగ్, బారికేడింగ్, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు.
నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేలా ప్రజలు, ముఖ్యంగా యువతలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.
జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.
నిమజ్జన కార్యక్రమంలో పోలీసుల సూచనలు, నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ కోరారు.
పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆవిష్కరించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

# బడుగు వర్గాల భవిష్యత్తుకు విద్యే వెలుగుబాట

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అన్ని రంగాల్లో ముందుకు రావాలి-విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలి: మంత్రి దామోదర రాజనర్సింహ**

హైదరాబాద్ సెప్టెంబర్ 09
బడుగు, బలహీన వర్గాల ప్రజలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, సామాజిక, ఆర్థిక తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి సమాజంలో ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు, యువత విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత విద్యను అభ్యసించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ ముప్పారం ప్రకాష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో జర్నలిస్ట్ రమేష్ దారమళ్ల, ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు, దళిత--బహుజన విద్యార్థి సంఘాల నాయకులు, సామాజిక కుల సంఘాల ప్రతినిధులు పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బడుగు వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక అభివృద్ధి తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు.

### విద్యతోనే సామాజిక అభివృద్ధి

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి విద్య ఎంతో కీలకమైన సాధనమని అన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుపై మరింత ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.
నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకత్వం వహించాల్సి ఉంటుందని, అందువల్ల విద్యార్థులు తమ లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కష్టపడి చదవాలని అన్నారు. కేవలం డిగ్రీలు పొందడమే కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, పోటీ పరీక్షలు, పరిశోధన రంగాలపై కూడా విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు.

### యువత అభివృద్ధి చెందాలి

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని మంత్రి పేర్కొన్నారు. యువత విద్యతో పాటు తమలోని ప్రతిభను గుర్తించి వివిధ రంగాల్లో రాణించేందుకు ప్రయత్నించాలని అన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.
ప్రత్యేకించి దళిత, బహుజన వర్గాలకు చెందిన యువత ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో పాటు పరిశోధన, సాంకేతిక, వైద్య, ఇంజినీరింగ్, పరిపాలనా రంగాల్లోకి పెద్ద సంఖ్యలో రావాలని ఆకాంక్షించారు.

### విద్యార్థులకు సంక్షేమ పథకాల ద్వారా అండ

ఆర్థిక పరిస్థితులు ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. సోషల్ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ తదితర సంక్షేమ విభాగాల ద్వారా విద్యార్థులకు అందుతున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను ఉపయోగించుకుని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని



అన్నారు.

### బడుగు వర్గాలకు మెరుగైన వైద్యం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తోందని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండటం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు.

# టైటిల్ దిశగా దూసుకెళ్తున్న ఈస్ట్ జోన్

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ ఆధిపత్యం మూడో రోజు కూడా కొనసాగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (270) డబుల్ సెంచరీతో 708 పరుగుల భారీ స్కోరు సాధించిన ఈస్ట్ జోన్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ సౌత్ జోన్‌ను ఇబ్బంది పెడుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసి, ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్‌లు తమ బౌలింగ్‌తో సౌత్ జోన్ టాప్ ఆర్డర్‌ను పడగొట్టారు. సౌత్ జోన్ ఓపెనర్ నారాయణ్ జగదీషన్ (32) వేగంగా పరుగులు సాధించే ప్రయత్నం చేసి ముకేష్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత మంచి ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62) హాఫ్ సెంచరీ బాది నిలకడగా ఆడాడు. షేక్ రషీద్ (27)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేస్తుండగా, సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ రివర్స్ స్వింగ్‌తో రషీద్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. ఆ వెంటనే పడిక్కల్‌ను ముకేష్ కుమార్ డీప్ స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ ఔట్ చేయడంతో సౌత్ జోన్ కోలుకోలేని దెబ్బతింది. ఈ మ్యాచ్‌లో మరొక ప్రధాన ఆకర్షణ 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ డీఆర్ఎస్ నిర్ణయాలు. కెప్టెన్ ఇషాన్ కిషన్ మైదానం వెలుపల



ఉన్న సమయంలో స్టాండ్-ఇన్ కెప్టెన్‌గా వ్యవహరించిన సూర్యవంశీ, మైదానంలో చురుగ్గా నిర్ణయాలు తీసుకున్నాడు
. రికీ భుయ్ క్యాచ్ ఔట్ విషయంలోనే కాకుండా, షమీ బౌలింగ్‌లో రవిచంద్రన్ బ్యాట్ అంచుకు బంతి తగిలిన విషయాన్ని కీపర్ సహాయంతో గుర్తించి సూర్యవంశీ రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో ఎడ్జ్ అయినట్లు తేలడంతో రవిచంద్రన్ (23) వెనుతిరగాల్సి వచ్చింది. వికెట్లు పడుతున్నా.. సౌత్ జోన్ సారథి తిలక్ వర్మ పోరాడుతున్నాడు. 133 బంతుల్లో 56 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచిన తిలక్, శ్రేయాస్ గోపాల్ (26)తో కలిసి ఆరో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే ఆట ముగిసే సమయంలో శ్రేయాస్ గోపాల్‌ను కౌనైన్ ఖురైషి ఔట్ చేశాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమాయనికి సౌత్ జోన్ 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ 2, ముకేష్ కుమార్ 2 వికెట్లు తీయగా.. ఖురేషీ, శిఖర్ మోహన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



# బెంగళూరుకు హార్దిక్ పాండ్యా!?

భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను తన శాశ్వత శిక్షణా కేంద్రంగా మార్చుకుంటూ బెంగళూరుకు తరలివెళ్లాడు. దీంతో బీసీసీఐ అత్యాధునిక శిక్షణా కేంద్రాన్ని శాశ్వత ప్రాక్టీస్ బేస్‌గా ఎంచుకున్న మొదటి భారత క్రికెటర్‌గా హార్దిక్ నిలవనున్నాడు. సాంప్రదాయకంగా భారత కేంద్ర ఒప్పంద ఆటగాళ్లు ప్రధానంగా గాయాల పునరావాసం, ఫిట్‌నెస్ మూల్యాంకనాలు లేదా జాతీయ జట్టు శిబిరాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శిస్తారు. పాండ్యా నిర్ణయం ఆ పద్ధతికి ఒక ముఖ్యమైన విచలనాన్ని సూచిస్తుంది. ఈ ఆల్‌రౌండర్ అంతర్జాతీయ, ఐపీఎల్ లేదా దేశీయ విధుల్లో లేనప్పుడల్లా అక్కడ శిక్షణ తీసుకోవాలని యోచిస్తున్నాడు. పాండ్యా స్వస్థలం గుజరాత్‌లోని బరోడా అయినప్పటికీ, అతను గత దశాబ్దంలో ఎక్కువ భాగం ముంబైలోనే గడిపాడు. అక్కడ అతను ప్రధానంగా ఘన్సోలిలోని ముంబై ఇండియన్స్ హై-పెర్ఫార్మెన్స్ ఫెసిలిటీలో శిక్షణ పొందాడు. 32 ఏళ్ల అతను ప్రస్తుతం క్వాడ్రిసెప్స్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. గాయం కారణంగా అతను యూకేలో జరుగుతున్న భారత వైట్-బాల్ పర్యటనకు దూరమయ్యాడు. 6 నెలలుగా తన పునరావాసం,
శిక్షణా కార్యక్రమంలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గణనీయమైన సమయాన్ని గడిపాడు. 'హార్దిక్ ఇప్పటికే శాశ్వతంగా బెంగళూరుకు మారాడు. అతను నగర శివార్లలో, సీఓఈకి సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. తన కెరీర్‌లో మిగిలిన కాలానికి సీఓఈని తన శాశ్వత శిక్షణా కేంద్రంగా చేసుకున్న మొదటి భారత క్రికెటర్ అతనే అవుతాడు.' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. శిక్షణ కోసం తన లోయర్ పరేల్ నివాసం నుంచి ప్రతిరోజూ ప్రయాణించడం రోజురోజుకూ అసౌకర్యంగా మారడంతో పాండ్యా ముంబైని విడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

# భారత్, ఆఫ్ఘనిస్తాన్ సిరీస్ కు వైభవ్



భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు సెప్టెంబర్ 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనున్నాయి. శ్రేయస్ అయ్యర్ భారత జట్టుకు సారథ్యం వహించనుండగా.. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్ లు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరగనున్నాయి. టీమిండియాలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. సంజూ శాంసన్, జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రాగా.. జింబాబ్వే పర్యటనలో ఉన్న రింకూ సింగ్‌ను ఈ మ్యాచ్‌ల నుంచి తొలగించారు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించగా.. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డిల సెలెక్షన్ వారి ఫిట్‌నెస్ ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇండియాలో ఈ టీ20 సిరీస్ సోనీ స్పోర్ట్స్ నెట్వర్క్ లో



ప్రత్యక్షప్రసారం కానుంది. అలాగే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో చూడాలనుకునే అభిమానులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ను వీక్షించవచ్చు. ఈ మూడు మ్యాచ్‌లు సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. భారత క్రికెట్ అభిమానులు ఈ సిరీస్‌లో ఉత్కంఠభరితమైన పోటీలను ఆశించవచ్చు. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు . టీమిండియా జట్టు : శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిలి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా .
ఆఫ్ఘనిస్థాన్ జట్టు: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), నూర్ రెహ్మాన్ (వికెట్ కీపర్), సెడిఖుల్లా అటల్, దర్విష్ రసూలీ, అజ్మతుల్లా ఉమర్‌జాయ్, గుల్బాదిన్ నాయబ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, నంగియలై ఖరోటి, నూర్ అహ్మద్, ముజీబుర్ రెహ్మాన్,
ఫజల్ హక్ ఫరూకీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, నవీన్-ఉల్-హక్భారత్- ఆఫ్ఘనిస్తాన్ టీ20 సిరీస్ పూర్తి షెడ్యూల్ మొదటి టీ20 - సెప్టెంబర్ 13, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) రెండో టీ20 - సెప్టెంబర్ 15, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) మూడో టీ20ఐ - సెప్టెంబర్ 17, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ)

# ఒక్క పరుగుతో తిలక్ వర్మ సెంచరీ మిస్



దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ జోన్ కేప్టెన్ తిలక్ వర్మ నిరాశకు గురి చేశాడు. చెన్నైలోని చేపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్ లో అద్భుత పోరాటపటిమను ప్రదర్శించాడు. ఒంటరి పోరాటంతో జట్టును ఇబ్బందుల నుంచి గట్టెక్కించినప్పటికీ.. ఒక్క పరుగు దూరంలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 211 బంతులను ఎదుర్కొన్న తిలక్ వర్మ.. 99 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతను అవుట్ అయ్యాక సౌత్ జోన్ తొలి ఇన్నింగ్ ఎంతో సేపు కొనసాగలేదు. 336 పరుగులకు ఆలౌట్ అయింది.

నాలుగో రోజు మధ్యాహ్నానికే ఈస్ట్ జోన్ తో 394 పరుగులు వెనుకంజలో ఉందీ జట్టు. సౌత్ జోన్ లో ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ పెద్దగా రాణించలేదు. ఓపెనర్ రికి భుయ్ ఒక పరుగుకే అవుట్ అయ్యాడు. నారాయణ్ జగదీశన్- 32, దేవ్ దత్ పడిక్కల్- 62, షేక్ రషీద్- 27, స్మరన్ రవిచంద్రన్- 23, శ్రేయాస్ గోపాల్- 26 పరుగులు చేశారు. చివర్లో చామా వీ మిలింద్ 43 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ఈస్ట్ జోన్ లో ముఖేష్ కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మహ్మద్ షమీ, ఖురేషీ, శిఖర్ మోహన్ రెండేసి చొప్పున వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్ లో ఈస్ట్ జోన్ 708 పరుగులకు ఆలౌట్ అయింది. కేప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో తడాఖా చూపాడు. కుమార్ కుశాగ్ర 101తో చెలరేగాడు. ఈస్ట్ జోన్ కు ధీటుగా బదులివ్వలేకపోయింది సౌత్. తిలక్ వర్మ, దేవ్ దత్ పడిక్కల్, మిలింద్ మాత్రమే ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. ఈ క్రమంలో తిలక్ వర్మ శతకానికి చేరువ అయ్యాడు గానీ దాన్ని అందుకోలేకపోయాడు. 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు మహ్మద్ కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ ఫైనల్ లో సెంచరీకి ఒక పరుగు దూరంలో ఇలా దురదృష్టకరంగా అవుట్ కావడం విస్మయానికి గురిచేసింది. దులీప్ ట్రోఫీ ఆరంభం నుండి తిలక్ వర్మ అసాధారణంగా ఆడుతున్నాడు. అత్యుత్తమ ఫామ్‌ను కనబరుస్తున్నాడు. ఈ సీజన్ సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో 250 బంతుల్లో అజేయంగా 116 పరుగులు చేయడమే కాకుండా, రెండో ఇన్నింగ్స్‌లో కూడా 79 బంతుల్లో 51 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇప్పుడు మళ్లీ ఫైనల్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో కీలక ప్రదర్శన చేసి, తన జట్టుకు బ్యాటింగ్‌లో సెంచరీకి చేరువ అయ్యాడు.



## సంపాదకీయం

# యుద్ధ విరమణ

## దిశగా సాగని చర్చలు!!

రష్యా- ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగిన ఎ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా-రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ సందర్భంగా, పుతిన్ యూరోప్ పట్ల రష్యాకు దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషాకోవ్, పుతిన్ మరియు ట్రంప్ మధ్య జరిగిన ఈ గంటల సంభాషణ 'సంఘటితమైన మరియు చాలా స్పష్టమైనది' అని పేర్కొన్నారు. విట్కాఫ్ మరియు కుష్నర్ చేసిన సందర్శన ఫలితాలను మాస్కో సానుకూలంగా చూస్తుందని ఆయన చెప్పారు. 'డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం చేశాడు, ఇది అమెరికా మరియు రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ చెప్పారు. 'ఈ దృష్టిలో, ఇది వాణిజ్య మరియు ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభావం చూపుతుంది, రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్షతలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నాడు. ఈ దృష్టిని పుతిన్ మద్దతు ఇచ్చారు'. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేందుకు ట్రంప్ మరియు పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో యూరోపియన్ దేశాల పట్ల రష్యా యొక్క దురాశల గురించి చర్చ జరిగింది. 'యూరోప్ పట్ల మాకు ఏ దురాశలు లేవు' అని ఉషాకోవ్ చెప్పారు. ఈ కాల్‌పై వైట్ హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుండి వెంటనే స్పందన లేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్ మరియు స్టీవ్ విట్కాఫ్ మాస్కో మరియు కీవ్‌లో పుతిన్ మరియు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరు చర్చలకు వెళ్లారు. ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ప్రధానమైన ప్రగతి సాధించలేకపోయాయి, మరియు రెండు దేశాలు శుక్రవారం జరిగిన శాంతి విరమణ తర్వాత తమ వాయు యుద్ధాన్ని కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన ప్రకారం, రష్యా కీవ్ నగరాన్ని డ్రోన్లు మరియు మిస్సైల్‌లతో బాంబు విసిరినప్పుడు రెండు వ్యక్తులు మరణించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో రెండు వ్యక్తులు మరణించారు. ఇటీవల నెలలుగా, రష్యా మరియు ఉక్రెయిన్ ఒకదానికొకటి నష్టపరిహారం చెల్లించేందుకు తమ వాయు యుద్ధాన్ని పెంచాయి. ఈ రోజు ముందుగా, రష్యా అధ్యక్షుడి ప్రాతినిధి దిమిత్రి పెస్కోవ్, 'రష్యాకు విజయానికి దగ్గరగా ఉన్నామని' చెప్పారు, 'విజయం చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ , దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. 11న దిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ - పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు.

రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలో నైనా రష్యా యుద్ధం ముగింపుకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నవ్యాంధ్ర పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి ప్రాచుర్యం

### నవ్యాంధ్రలో తొలిసారిగా 41వ 'ఐఏటీఓ' జాతీయ సదస్సు"

### ఇండియా - ది వరల్డ్స్ నెక్ట్స్ టూరిజం ఆపర్చునిటీ" థీమ్‌తో సదస్సు నిర్వహణ




విశాఖపట్నం, సెప్టెంబర్ 9
ఆంధ్రప్రదేశ్ లో బాధ్యతాయుతమైన, పర్యావర ణహిత పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకా రాలతో రాష్ట్రంలో పర్యాటక విప్లవం ఆవిష్కృత మవుతోందని ఆయన స్పష్టం చేశారు. విశాఖప ట్నంలోని నోవాటెల్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఈ నెల 10 నుండి 12 వరకు విశాఖ వేదికగా జరగనున్న 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ సదస్సు వివరాలను మంత్రి దుర్గేష్ మీడియాకు వెల్లడించారు. సెప్టెంబర్ 13న ఐఏటీఓ సభ్యుల కోసం ఏపీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో 6 ప్రత్యేక 'పోస్ట్ కన్వెన్షన్' టూర్లు ఏర్పాటు చేశామన్నారు. నవ్యాంధ్రలో తొలిసారిగా ప్రతిష్టాత్మక 'ఐఏటీఓ' జాతీయ సదస్సు..గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా ఏపీఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. భారతదేశంలో ఇన్-బౌండ్ టూరిజం అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రతిష్టాత్మక 41వ జాతీయ సదస్సును ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తోందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. "ఇండియా - ది వరల్డ్స్ నెక్ట్స్ టూరిజం ఆపర్చునిటీ" అనే ముఖ్య థీమ్ తో జరుగుతున్న ఈ సదస్సులో దేశవ్యాప్తంగా 1,000 మందికి పైగా పర్యాటక రంగ ప్రతినిధులు, ప్రముఖ టూర్ ఆపరేటర్లు, విధాన నిర్ణేతలు మరియు పారిశ్రామికవేత్తలు పాల్గొంటు న్నారని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా 2,068 కంటే ఎక్కువ మంది ప్రతినిధులతో ఇన్-బౌండ్ టూరిజంలో అగ్రగామిగా ఉన్న ఐఏటీఓ ) జాతీయ సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి జరిగిన ఈ సదస్సు, నవ్యాంధ్రప్రదేశ్ ఆవిర్భావం తర్వాత జరగడం ఇదే తొలిసారి అని తెలిపారు. ఈ వేదిక ఏపీ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి దోహదపడుతుందన్నారు. రేపు (గురువారం) సాయంత్రం జరిగే ఐఏటీఓ జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అదే విధంగా కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి భువనేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు మరియు పర్యాటక రంగ ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ 1000కి.మీలకు పైబడిన సుదీర్ఘ సముద్ర తీరం, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం, అరకు లోయ, గిరిజన సంస్కృతి, బౌద్ధ క్షేత్రాలు మరియు సహజ సౌందర్యాన్ని అంతర్జాతీయ పర్యాటక పటంలో నిలపడానికి వేదిక సుగమమైందన్నారు.

# ఏలూరు జిల్లాలో శాశ్వత ఎన్‌డీపీఎస్ కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్ ప్రారంభం



ఏలూరు, సెప్టెంబర్, 9 హైకోర్టు ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా పరిధిలో ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు, గంజాయి, ఇతర నిషేధిత పదార్థాలను భద్రపరిచేందుకు నూతనంగా నిర్మించిన శాశ్వత ఎన్‌డీపీఎస్ కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్‌ను బుధవారం ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ, శాశ్వత ఎన్‌డీపీఎస్ కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్ ఏర్పాటు ద్వారా జిల్లాలోని ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించిన స్వాధీనం చేసిన పదార్థాల భద్రత, పర్యవేక్షణ ,నిర్వహణ మరింత క్రమబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ శాశ్వత కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్‌ను జిల్లా పోలీసు కార్యాలయం , ఏలూరు సమీపంలోని ఏఆర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు జిల్లా పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లలో నమోదయ్యే ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలు ఇతర కాంట్రాబాండ్‌ను పోలీసు స్టేషన్ వారీగా క్రమబద్ధంగా భద్రపరచడం జరుగుతుందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన శాశ్వత కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్‌లో స్వాధీనం చేసిన పదార్థాల భద్రతకు అవసరమైన ప్రవేశ నియంత్రణ, పర్యవేక్షణ, భద్రతా ఏర్పాట్లు మరియు క్రమబద్ధమైన భద్రపరిచే విధానాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసిన మాదకద్రవ్యాలు మరియు ఇతర నిషేధిత పదార్థాల భద్రత, పర్యవేక్షణ, నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వీలు కలుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ, ఇంఉఒఇ విభాగం, నషా ముక్త్ భారత్ అభియాన్ బృందం, రోడ్లు మరియు భవనాల శాఖ ఎస్ఈ విజయరత్నం, ఈఈ కిషోర్‌బాబుజీ, ఏలూరు డిఎస్పితో పాటు ఇతర సంబంధిత జిల్లా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు




హైదరాబాద్, సెప్టెంబర్ 09
తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే మంత్రి సీతక్క, బీఆర్ఎస్ నేతల దాడిలో గాయపడిన మహిళా పోలీసు సిబ్బందిని పరామర్శి ంచారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను తమ ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని ఆమె స్పష్టం చేశారు. కాగా, మంత్రి సీతక్క విడుదల చేసిన ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసినవని, అవి ఏఐ-జనరేటెడ్ అని బీఆర్ఎస్ నేతలు కొట్టిపారేశారు.

## ఘనంగా కాళోజీ 112వ జయంతి వేడుకలు

హైదరాబాద్, ఖైరతాబాద్‌లోని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ మరియు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తదితరులు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ అసిస్టెంట్ సెక్రెటరీ ఎన్. సునీత, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మీనారాయణ మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు గొప్ప కవి మరియు ప్రజా ప్రతినిధి అని, తెలంగాణ మాండలికాన్ని ఎగతాళి చేసిన వారికి తన శక్తివంతమైన, నిర్భయమైన కవితల ద్వారా తగిన సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అలాగే శాసనమండలి సభ్యునిగా కూడా సేవలందించారని గుర్తుచేశారు.




# ఉబర్‌లో ఇక వర్క్ ఫ్రమ్ హోమ్‌కు బ్రేక్..

ప్రముఖ రైడ్ హెయిలింగ్ సంస్థ ఉబర్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సుమారు 3,300 ఉద్యోగాలను తొలగించిన సంస్థ.. ఇప్పుడు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని కూడా కఠినతరం చేసింది. ఇకపై పూర్తిగా రిమోట్‌గా పనిచేసే ఉద్యోగుల సంఖ్యను సంస్థ మొత్తం ఉద్యోగుల్లో సుమారు 1 శాతానికే పరిమితం చేయనుంది. అంటే ఇంటి నుంచే శాశ్వతంగా పనిచేసే విధానం దాదాపుగా ముగిసినట్లే

దాదాపు 3,300 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ఉబర్ సెప్టెంబర్ 2న ప్రకటించింది. ఇది సంస్థ మొత్తం కార్పొరేట్ ఉద్యోగుల్లో సుమారు 10 శాతానికి సమానం. కోవిడ్-19 మహమ్మారి తర్వాత ఉబర్ చేపట్టిన అతిపెద్ద ఉద్యోగాల కోత ఇదే. సంస్థలో మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, చిన్న టీమ్‌లను విలీనం చేయడం, నిర్ణయాలు వేగంగా తీసుకునేలా సంస్థాగత నిర్మాణాన్ని సరళీకరించడం తమ ప్రధాన లక్ష్యాలని సీఈఓ దారా ఖోస్రోషాహి తెలిపారు. మేనేజర్ల సంఖ్యను కూడా సుమారు 20 శాతం తగ్గించనున్నట్లు సంస్థ వెల్లడించింది .ఉద్యోగుల తొలగింపుతో పాటు ఉబర్ తీసుకున్న మరో కీలక నిర్ణయం వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి సంబంధించినది వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని పరిమితం చేసినప్పటికీ ఉబర్ పూర్తిగా ఐదు రోజుల ఆఫీస్ విధానాన్ని అమలు చేయడం లేదు. సంస్థ ఇప్పటికే అమల్లో ఉన్న హైబ్రిడ్ వర్క్ పాలసీని కొనసాగించనుంది. దీని ప్రకారం ఉద్యోగులు వారానికి కనీసం మూడు రోజులు కార్యాలయం నుంచి పనిచేయాలి.

# టోకనైజ్డ్ బాండ్లు వచ్చేశాయ్..




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఆర్ఈసీ లిమిటెడ్.. టోకనైజ్డ్ బాండ్ల జారీ ద్వారా రూ.500 కోట్లు సమీకరించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దేశంలో ఇదే తొలి టోకనైజ్డ్ బాండ్ల జారీ అని.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి దిగ్గజాలు సహా పలు బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు, కార్పొరేట్లు ఆ బాండ్లను కొనుగోలు చేసినట్లు తెలిపాయి. 2028 మే నెలతో గడువు ముగియనున్న ఈ బాండ్లపై ఆర్ఈసీ 7.30 శాతం వార్షిక వడ్డీ ఆఫర్ చేసినట్లు తెలిసింది.ఎల్ అండ్ టీ కూడా: ప్రైవేట్ రంగ ఇంజనీరింగ్ దిగ్గజం ఎల్ అండ్ టీ సైతం మూడేళ్ల కాలపరిమితితో కూడిన టోకనైజ్డ్ బాండ్ల జారీ ద్వారా రూ.500 కోట్ల వరకు సమీకరించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. బుధవారం జారీ చేయనున్న ఈ బాండ్లపై ఎల్ అండ్ టీ కంపెనీ 7.40 శాతం వార్షిక వడ్డీ ఆఫర్ చేయబోతున్నట్లు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు వెల్లడించాయి.

టోకనైజ్డ్ బాండ్లు అంటే..?

బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఈ టోకనైజ్డ్ బాండ్లను జారీ చేస్తారు. బాండ్ల జారీ, వాటి హక్కుదారుతో పాటు బాండ్ల ట్రేడింగ్, సెటిల్‌మెంట్ వంటి వివరాలను బ్లాక్ చెయిన్ లెడ్జర్‌లో డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేస్తారు. ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన డిజిటల్ రూపీ (సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ-సీబీడీసీ) ద్వారానే ఈ బాండ్లను కొనుగోలు చేసే వీలుంటుంది. అలాగే, బాండ్ల సెటిల్‌మెంట్ కూడా అదే రోజున పూర్తవుతుంది. కార్పొరేట్ బాండ్ మార్కెట్ మరింత విస్తృతమవడంతో పాటు ద్రవ్య లభ్యత, పారదర్శకత పెంపునకు ఈ టోకనైజ్డ్ బాండ్లు దోహదపడగలవని విశ్లేషకులు పేర్కొన్నారు.

# బరువు తగ్గాలనుకునేవారికి ఉపయోగకరమైన వ్యాయామాలు ఇవే.. ఏం చేయాలంటే..?



బరువు తగ్గాలనుకునే చాలామంది కార్డియో వ్యాయామాలపైనే ఎక్కువగా ఆధారపడుతుంటారు. వ్యాయామం చేస్తే చెమటలు పట్టాలి, శ్వాస వేగంగా తీసుకోవాలి, అప్పుడే కొవ్వు కరుగుతుందని చాలామంది భావిస్తారు. నిజానికి కార్డియో ద్వారా శరీరం కేలరీలను ఖర్చు చేస్తుంది. ఆహారం ద్వారా తీసుకునే కేలరీలను నియంత్రించడంతోపాటు వ్యాయామం చేస్తే బరువు తగ్గే ప్రక్రియకు సహాయపడుతుంది. అయితే అన్ని రకాల కార్డియో వ్యాయామాలు శరీరంపై ఒకే విధమైన ప్రభావాన్ని చూపించవు. వ్యాయామం తీవ్రత, కీళ్లపై పడే ఒత్తిడి, శరీరానికి అవసరమయ్యే రికవరీ సమయం, కొవ్వు తగ్గడంలో దాని ప్రభావం వంటి అంశాల్లో వీటి మధ్య తేడాలు ఉంటాయి. ప్రతి ఒక్కరికీ అత్యంత కఠినమైన వ్యాయామమే ఉత్తమమైనది కాదు. ఎక్కువ కాలం కొనసాగించగలిగే, శరీరంపై అధిక ఒత్తిడి కలిగించని వ్యాయామం బరువు తగ్గే ప్రయాణంలో మరింత ఉపయోగకరంగా ఉంటుందని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు.

వాకింగ్..వాకింగ్ కొవ్వు తగ్గించడానికి అత్యుత్తమ కార్డియో వ్యాయామాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇది కీళ్లపై తక్కువ ప్రభావం చూపుతుంది. ప్రత్యేకంగా రికవరీ సమయం కూడా పెద్దగా అవసరం ఉండదు. అంతేకాకుండా ఎక్కడైనా, ఎప్పుడైనా సులభంగా చేయగలగడం దీని ప్రధాన ప్రయోజనం. అధిక తీవ్రత కలిగిన కార్డియోతో పోలిస్తే వాకింగ్ ఆకలిని ఎక్కువగా పెంచదని వారు చెబుతున్నారు. అందువల్ల దీన్ని క్రమం తప్పకుండా కొనసాగించడం సులభం. వాకింగ్‌కు కొద్దిగా ఇన్‌క్లైన్ జోడిస్తే మరింత ప్రయోజనం ఉంటుంది. ట్రెడ్‌మిల్‌పై వంపు పెంచి నడవడం వల్ల హృదయ స్పందన రేటు, కేలరీల ఖర్చు పెరుగుతాయి. అదే సమయంలో పరుగు వంటి హై ఇంపాక్ట్ వ్యాయామాలతో పోలిస్తే మోకాళ్లు, చీలమండలపై పడే ఒత్తిడి తక్కువగా ఉంటుంది. ఇన్‌క్లైన్ వాకింగ్ గ్లూట్స్, కాళ్ల కండరాలను కూడా ఎక్కువగా పనిచేయిస్తుంది. అందుకే కొవ్వు తగ్గించుకోవాలనుకునేవారికి ఇది ప్రత్యేకంగా ఉపయోగపడుతుందని వారు చెబుతున్నారు. స్టెయిర్‌మాస్టర్ కూడా కొవ్వు తగ్గించడానికి సమర్థవంతమైన వ్యాయామం.

తక్కువ సమయంలోనే ఎక్కువ కేలరీలను ఖర్చు చేయడంతోపాటు కాళ్ల కండరాలు, ముఖ్యంగా గ్లూట్స్‌పై మంచి ప్రభావం చూపుతుంది. జిమ్‌లో ఎక్కువ సమయం కేటాయించలేని వారికి ఇది ఉపయోగకరమైన కార్డియోగా పేర్కొంటున్నారు. 10 నుంచి 15 నిమిషాల వ్యాయామం కూడా మంచి ఫలితాన్ని ఇస్తుంది

# సాల్మొనెల్లా బ్యాక్టీరియా అంటే ఏమిటి..

## ఇది ఎక్కడ ఉంటుంది, ఎలా వ్యాప్తిస్తుంది..?



సాల్మొనెల్లా అనే బ్యాక్టీరియా కలుషితమైన ఆహారం, నీరు, పెంపుడు జంతువులు, పక్షులు, సరీసృపాలు, అలాగే కలుషితమైన వస్తువులు, ఉపరితలాల ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. ఆహారంతో వచ్చే అనారోగ్యాలకు కారణమయ్యే ముఖ్యమైన బ్యాక్టీరియాల్లో ఇది ఒకటి. మనం రోజువారీ జీవితంలో తాకే అనేక వస్తువులు, ఆహార పదార్థాలు, జంతువుల ద్వారా ఇది వ్యాప్తి చెందే అవకాశం ఉండటంతో, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఆహారాన్ని సురక్షితంగా నిర్వహించడం చాలా ముఖ్యం. తాజాగా అమెరికాలో సాల్మొనెల్లాతో సంబంధం ఉన్న 10 వ్యాప్తి ఘటనలను అధికారులు గుర్తించారు. వీటిలో జలపెనో మిరపకాయలు, ఇంటి వద్ద పెంచే పౌల్ట్రీ, గుడ్లు, మునగ ఆకుల పొడి, తాబేళ్లు, ఊసరవెల్లులు, గెక్కోలు, బియర్డెడ్ డ్రాగన్స్ వంటి వివిధ వనరులు ఉన్నాయి. గత కొన్నేళ్లలో హోమ్ డెలివరీ భోజనాలు, డ్రై డాగ్ ఫుడ్, తర్బూజా, లోఫ్, కీరదోస, తరిగిన ఉల్లిపాయలు, అల్ఫాల్ఫా మొలకలు, తులసి, పిండి, పచ్చి కుకీ డో, చేపలు, మాంసం, చార్కుటరీ మాంసం, పిస్తా క్రీమ్, పీనట్ బటర్ వంటి ఆహార పదార్థాలతో కూడా సాల్మొనెల్లా వ్యాప్తి నమోదైంది.

ఎక్కడ ఉంటుంది..సాల్మొనెల్లా ప్రధానంగా మనుషులు, జంతువులు, పక్షులు, కీటకాల జీర్ణాశయాల్లో ఉంటుంది. ఇవి విసర్జించే మలంతో బ్యాక్టీరియా బయటకు వచ్చి, అది తాకిన ఆహారం, నీరు, మట్టి, వస్తువులు లేదా ఇతర ఉపరితలాలను కలుషితం చేస్తుంది. అనుకూల పరిస్థితుల్లో సాల్మొనెల్లా నీటిలో కొన్ని వారాల పాటు, మట్టి లేదా ఆహారంలో సంవత్సరాల పాటు జీవిస్తుంది. ఈ బ్యాక్టీరియా సాధారణంగా 35 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, తటస్థ ఆమ్లత్వం, అధిక తేమ ఉన్న పరిస్థితుల్లో వేగంగా పెరుగుతుంది. అయితే వివిధ పరిస్థితులకు తట్టుకునే సామర్థ్యం కూడా సాల్మొనెల్లాకు ఉంటుంది. తక్కువ ఉష్ణోగ్రతలు, అధిక లేదా తక్కువ ఆమ్లత్వం వంటి పరిస్థితుల్లో కూడా కొంతకాలం జీవించగలగడం వల్ల ఇది అనేక రకాల వాతావరణాల్లో, ఆహారాల్లో కనిపించే అవకాశం ఉంటుంది. సాల్మొనెల్లా మనుషులకు ప్రధానంగా ఫీకల్-ఓరల్ మార్గంలో సోకుతుంది. అంటే సోకిన మనిషి లేదా జంతువు మలంలో ఉన్న బ్యాక్టీరియా చేతులు, ఆహారం, నీరు లేదా ఇతర వస్తువుల ద్వారా మరో వ్యక్తి నోటికి చేరినప్పుడు ఇన్ఫెక్షన్ ఏర్పడుతుంది. సాల్మొనెల్లాలో 2,500కు పైగా రకాలను గుర్తించినప్పటికీ, వాటిలో సుమారు 100 రకాలు మాత్రమే మనుషుల్లో అనారోగ్యానికి కారణమవుతాయి. సాల్మొనెల్లా ఎంటెరిటిడిస్, సాల్మొనెల్లా టైఫిమ్యూరియం వంటి రకాలు ఎక్కువగా ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి.

# డిప్రెషన్ మందులకు రోగి స్పందిస్తున్నాడా, లేదా ఇకపై చాలా త్వరగా తెలుసుకోవచ్చు.. సైంటిస్టుల పరిశోధన..



డిప్రెషన్‌కు యాంటీడిప్రెసెంట్ మందులు ప్రారంభించిన తర్వాత చికిత్సకు రోగి ఎలా స్పందిస్తారో తెలుసుకోవడానికి సాధారణంగా కొన్ని వారాలు వేచి చూడాల్సి ఉంటుంది. అయితే మెదడు, జీర్ణాశయం నుంచి వచ్చే విద్యుత్ సంకేతాలను క్లినికల్ లక్షణాలతో కలిపి విశ్లేషించడం ద్వారా చికిత్సకు స్పందనను కేవలం వారం రోజుల్లోనే అంచనా వేయవచ్చని కొత్త అధ్యయనం సూచిస్తోంది. ఈ విధానం భవిష్యత్తులో డిప్రెషన్‌కు వ్యక్తిగతీక రించిన చికిత్స అందించేందుకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఐఐటీ కాన్పూర్, గణేశ్ శంకర్ విద్యార్థి మెమోరియల్ మెడికల్ కాలేజీకి చెందిన పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయనం ఫ్రంటియర్స్ ఇన్ సైకియాట్రీ జర్నల్‌లో ప్రచురితమైంది. ప్రస్తుతం యాంటీడిప్రెసెంట్ చికిత్స ప్రారంభించిన తర్వాత దాని ప్రభావాన్ని అంచనా వేయడానికి సాధారణంగా నాలుగు నుంచి ఆరు వారాల సమయం పడుతోంది. అయితే కొత్త పరిశోధనలో చికిత్స ప్రారంభించిన 7 నుంచి 10 రోజుల్లోనే కొంతమంది రోగులు మందులకు స్పందించే అవకాశం లేదని గుర్తించగలిగినట్లు పరిశోధకులు తెలిపారు.

ముందుగానే గుర్తిస్తే చికిత్సను మార్చవచ్చు..

డిప్రెషన్ అనేది దీర్ఘకాలంగా విచారం, నిస్సహాయత, సాధారణ కార్యకలాపాలపై ఆసక్తి తగ్గడం వంటి లక్షణాలతో కనిపించే మానసిక ఆరోగ్య సమస్య. సరైన మందులు చికిత్స అందించినప్పటికీ డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో సుమారు 30 శాతం మందికి చికిత్స ఆశించిన స్థాయిలో పనిచేయదని అధ్యయనం పేర్కొంది. అలాంటి రోగులను ముందుగానే గుర్తించగలిగితే చికిత్సా విధానాన్ని త్వరగా మార్చేందుకు అవకాశం ఉంటుంది. ఈ పరిశోధనలో మెదడులోని విద్యుత్ కార్యకలాపాలను ఎలక్ట్రోఎన్సెఫలోగ్రఫీ (ఈఈజీ), జీర్ణాశయంలోని విద్యుత్ కార్యకలాపాలను ఎలక్ట్రోగ్యాస్ట్రోగ్రఫీ (ఈజీజీ) ద్వారా పరిశీలించారు. ఈ రెండు రకాల సంకేతాలను రోగుల క్లినికల్ లక్షణాలతో కలిపి విశ్లేషించారు. చికిత్స ప్రారంభించే సమయంలో ఒకసారి, దాదాపు వారం రోజుల తర్వాత మరోసారి ఈ సంకేతాలను నమోదు చేశారు. మొత్తం 206 మందిని పరిశోధనలో పరిశీలించారు. వీరిలో ఇంతకుముందు డిప్రెషన్‌కు చికిత్స తీసుకోని 144 మంది ఉన్నారు. చికిత్స ప్రారంభానికి ముందు, చికిత్స ప్రారంభించిన సుమారు వారం తర్వాత వారి మెదడు, జీర్ణాశయం నుంచి వచ్చే విద్యుత్ సంకేతాలను సేకరించారు. అనంతరం ఈ సమాచారాన్ని ఉపయోగించి యాంటీడిప్రెసెంట్ చికిత్సకు స్పందించే అవకాశం తక్కువగా ఉన్న వారిని గుర్తించే నమూనాను రూపొందించారు.

గణనీయంగా మెరుగైన ఫలితాలు..

పరిశోధకులు రూపొందించిన మోడల్ ప్రారంభ దశలో చికిత్సకు స్పందించని రోగులను గుర్తించడంలో 84 శాతం సెన్సిటివిటీ, 78 శాతం స్పెసిఫిసిటీ సాధించింది. అంటే స్పందించని వ్యక్తులను గుర్తించడంలో మోడల్ గణనీయమైన సామర్థ్యాన్ని చూపించింది. స్వతంత్ర రోగుల సమూహంపై పరీక్షించినప్పుడు ఈ మోడల్ మొత్తం 77.3 శాతం కచ్చితత్వాన్ని సాధించింది. స్పందించని రోగులను గుర్తించడంలో 71.4 శాతం సెన్సిటివిటీ, 80 శాతం స్పెసిఫిసిటీ నమోదైనట్లు పరిశోధకులు తెలిపారు. వేర్వేరు లక్షణాలతో ఉన్న డిప్రెషన్ రోగుల్లో మెదడు, జీర్ణాశయం శారీరక కార్యకలాపాల్లో కూడా భిన్నమైన నమూనాలు కనిపించాయని పరిశోధకులు గుర్తించారు. ఈ జీవశాస్త్ర సంబంధిత భేదాలను గుర్తించడం ద్వారా ఒకే మందుకు వేర్వేరు రోగులు ఎందుకు భిన్నంగా స్పందిస్తారో అర్థం చేసుకోవడానికి సహాయం దుతుందని వారు పేర్కొన్నారు.వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా డిప్రెషన్ చికిత్స..

మెదడు, జీర్ణాశయం నుంచి వచ్చే విద్యుత్ సంకేతాలను క్లినికల్ లక్షణాలతో కలిపి విశ్లేషించడం ద్వారా డిప్రెషన్ చికిత్సను వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చుకునే అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు.



# నా మానసిక ధైర్యాన్ని దెబ్బతీశాయి

సినీ పరిశ్రమలో విజయాలు ఎంత గుర్తింపు తీసుకొస్తాయో... పరాజయాలు అంతకంటే ఎక్కువ ఒత్తిడిని మోసుకొస్తాయి. ముఖ్యంగా సోషల్ మీడియా హవా నడుస్తున్న నేటికాలంలో సినిమా ఫలితం తేడా కొడితే నటీనటులపై వచ్చే ట్రోలింగ్ వారిని తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తుంది. ఇలాగే హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజా ఇంటర్వ్యూలో చెబుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా అభిలాష్ జోషి దర్శకత్వంలో సుమారు రూ.50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ' కింగ్ ఆఫ్ కోథా ' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సినిమా పరాజయం తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపై చూపిన ప్రతికూల ప్రభావం గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. 2023లో భారీ హైప్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కింగ్ ఆఫ్ కోథా' బాక్సాఫీస్ వద్ద చతికిలబడటంతో పాటు, నెట్టింట తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంది. చిత్ర బృందంతో పాటు తనపై వచ్చిన ట్రోలింగ్ తనను తీవ్రంగా కలచివేసిందని ఐశ్వర్య తెలిపారు. సినిమాలో తన నటన, సంభాషణలు పలికే తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుల విమర్శలు నిజమేనేమో అని తానూ భావించినట్లు చెప్పారు. ముఖ్యంగా దుల్కర్ పాత్రను ఉద్దేశించి తాను పలికిన 'రాజువెట్టా' అనే సంభాషణ నెట్టింట దారుణంగా ట్రోలింగ్‌కు గురైందని గుర్తుచేసుకున్నారు. ఈ నెగెటివిటీ అక్కడితో ఆగకుండా షూటింగ్ లొకేషన్లకూ పాకిందని ఐశ్వర్య గుర్తు చేసుకున్నారు. 'హలో మమ్మీ' సినిమా షూటింగ్ సమయంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ తనను ఉద్దేశపూర్వకంగా ఆ పేరుతో పిలిచి గేలి చేయడంతో తీవ్రంగా మనస్తాపం చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

# భన్సాలీతో కలిసి పని చేయబోతున్నారా?



బాలీవుడ్ నటి కరీనా కపూర్ మరియు ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత ఒక కొత్త ప్రాజెక్ట్ పై చర్చలు జరుగుతున్నాయా? ఇటీవల కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఈ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇది నిజమైతే, కరీనా మరియు భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత జరిగే మొదటి సహకారం అవుతుంది, ఎందుకంటే వారు 'దేవదాస్' సినిమా సమయంలో ఒక గొడవకు గురయ్యారు. సెప్టెంబర్ 8న కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు పాస్టెల్ బ్లూ సూట్ ధరించి కనిపించింది. ఆమె పాపారాజ్జీకి ఫోటోలకు నిలబడలేదు. సంజయ్ లీలా భన్సాలీ తన తదుపరి చిత్రంలో మహిళా నాయకత్వ పాత్ర కోసం కరీనాను సంప్రదించినట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమె తమిళ నటుడు ధనుష్‌తో కలిసి నటించనుంది, అయితే అన్ని విషయాలు బాగా జరిగితేనే. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు ఆమెకు ముఖ్యమైన పాత్ర ఉండబోతుంది. కరీనా ఈ చిత్రానికి ఆసక్తి చూపించినప్పటికీ, ఆమె ఇంకా సంతకం చేయలేదు. ఆమె తేదీలు, ఫీజులు మరియు ఇతర వివరాల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రం ఒక పౌరాణిక సాహస కథగా ఉంటుందని సమాచారం, ఇది అటవీ ప్రాంతంలో జరుగుతుంది. కథ అధికారికంగా వెల్లడించబడలేదు, కానీ ఈ చిత్రంలో ఒక ఏనుగు ముఖ్యమైన పాత్ర పోషించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. భన్సాలీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు, కాగా పి.ఎస్. మిత్రన్ దీనిని దర్శకత్వం వహించనున్నారు. ప్రాజెక్ట్ ప్రస్తుతం రచనలో ఉంది, ప్రీ-ప్రొడక్షన్ ఈ సంవత్సరం చివర్లో ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. షూటింగ్ 2027 జనవరిలో ప్రారంభమవుతుందని సమాచారం. కరీనా ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేస్తే, ఇది ఆమె మరియు భన్సాలీ మధ్య ఉన్న బాలీవుడ్‌లోని అత్యంత చర్చించబడిన వృత్తి గొడవను ముగించగలదు. కరీనా కపూర్ మరియు సంజయ్ లీలా భన్సాలీ మధ్య గొడవ 2000ల ప్రారంభంలో ప్రారంభమైంది, ఆ సమయంలో కరీనా 'దేవదాస్' చిత్రంలో పారో పాత్ర కోసం పరిశీలనలో ఉన్నది. కరీనా ఈ పాత్ర కోసం స్క్రీన్ టెస్ట్ చేసింది మరియు సంతకం చేసిన మొత్తాన్ని కూడా పొందింది. అయితే, ఈ పాత్ర చివరకు ఐశ్వర్య రాయ్ బచ్చన్‌కు వెళ్లింది, ఆమె 2002లో షారుక్ ఖాన్‌తో కలిసి నటించింది. కరీనా ఈ సంఘటనపై ఎంత బాధపడిందో గురించి మాట్లాడింది. ఒక పాత ఫిల్మ్‌ఫేర్ ఇంటర్వ్యూలో, ఆమె భన్సాలీతో పని చేయనని చెప్పింది. "నేను ఎప్పుడూ చేయను. ఆయన నాకు చేసినది తప్పు. ఆయన నాకు 'దేవదాస్' కోసం స్క్రీన్ టెస్ట్ ఇచ్చారు, సంతకం చేసిన మొత్తాన్ని ఇచ్చారు, తరువాత మరొకరిని తీసుకున్నారు. అది తప్పు, ఇది నాకు బాధ కలిగించింది, ఎందుకంటే నేను నా కెరీర్ ప్రారంభంలో ఉన్నాను. అది సరే, ఎందుకంటే ఆయన నన్ను విడిచిపెట్టిన రోజు నేను 'యాదెయిన్'కి సంతకం చేశాను. సంజయ్ నన్ను బాధపెట్టాడు. నేను పని లేకపోయినా, ఆయనతో పని చేయను" అని కరీనా చెప్పింది.

# నేడు ప్రేక్షకుల ముందుకు రానున్న 'మండాడి'




సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'మండాడి' నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిమా నంబియార్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్పి ఈ సినిమాను అత్యంత భారీ ఎత్తున విడుదల చేస్తోంది. తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. మూవీ చూసిన సెన్సార్ టీం సభ్యులు అద్భుతంగా వచ్చిందని అభినందించారు. ముఖ్యంగా ఇందులో వచ్చే బోట్ సీక్వెన్స్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయని, థియేటర్లలో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టడం ఖాయమని కొనియాడారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, మైండ్ బ్లోయింగ్ ట్రైలర్ సినిమాపై హైప్‌ను రెట్టింపు చేశాయి. మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఎస్.ఆర్. కథిర్ విజువల్స్ ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో గ్రాండ్‌గా, విజువల్ ఫీస్ట్‌లా మలిచాయి.

# మారేమ్మకు ఏ సర్టిఫికెట్ జారీ!




మాస్ మహారాజ రవితేజ ఇటీవల 'ఇరుముడి' మూవీతో కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఇరుముడి మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ఇప్పుడు రవితేజ తమ్ముడి కొడుకు మాధవ్ హీరోగా పరిచయం అవుతూ చేస్తున్న చిత్రం మారెమ్మ. ఈ మూవీ కూడా డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కాన్సెప్ట్ తో తెరకెక్కింది. ఇటీవల విడుదలైన ట్రైలర్ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా సెప్టెంబర్ 10వ తేదీన గ్రాండ్ గా రిలీజ్ అవుతోంది. ఈ చిత్రానికి మ ంచాల నాగరాజు దర్శకత్వం వహించారు. అలాగే మోక్ష ఆర్ట్స్ పతాకంపై మయూర్ రెడ్డి బండారు నిర్మించారు. మారెమ్మ చిత్రంలో మాధవ్ సరసన హీరోయిన్ గా తమిళ బ్యూటీ దీపా బాలు నటించింది. వీరితో పాటు ఈ మూవీలో వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపాలక్ష్మి, దయానంద్ రెడ్డి వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక మారెమ్మ చిత్రం ఇటీవల సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసుకుంది. ఈ చిత్రం రన్ టైమ్ 2 గంటల 15 నిమిషాలు అంటే.. 135 నిమిషాలుగా ఉంది. తక్కువ రన్ టైమ్ కావడంతో సినిమా చాలా గ్రిప్పింగ్ గా ఉంటుందని తెలుస్తోంది. అనవసరమైన వాటికి పోకుండా స్ట్రెయిట్ గా పాయింట్ చెప్పే ప్రయత్నం చిత్ర యూనిట్ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీకి సెన్సార్ బృందం ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అంటే 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే ఈ సినిమా చూసేందుకు అర్హులని అర్థం. ఇక మారెమ్మ సినిమా మిగతా సినిమాల మాదిరి కాదు.. గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ డివోషనల్ థ్రిల్లర్ కథే ఈ సినిమా. పెంపుడు జంతువులు, మానవుల మధ్య సంబంధాలను ఈ మూవీ ద్వారా సరికొత్తగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు దర్శకుడు మంచాల నాగరాజు. వరంగల్ జిల్లాలోని మహిషాపురం అనే గ్రామంలో ఈ మూవీ స్టార్ట్ అవుతుంది.

# 'రణబాలి'లో యోధుడిగా విజయ్




విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'రణబాలి'. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 1854-1878ల నాటి బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో, రాయలసీమ ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. ఇందులో విజయ్ పవర్‌ఫుల్ యోధుడిగా కనిపిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న దసరా కానుకగా విడుదల కానుంది. వారు ఆ కథను పాతిపెట్టారు.. వారు ఆ పేరును చెరిపివేశారు. వారు తమ పాపాలను తుడిచిపెట్టారు. కానీ అతని రౌద్రాగ్ని మాత్రం ఎప్పటికీ పాతిపెట్టలేకపోయారు. జానపద గాథలు, చరిత్ర అతన్ని ఎప్పటికీ మరువవు. రణబాలి.. ఆ యోధుడి ప్రతిజ్ఞ" అని మేకర్స్ పేర్కొన్నారు. "అతిథులుగా వచ్చి, అణచివేతదారులుగా మిగిలిపోయిన వారిని. రక్తం చిందించాలని నిర్ణయించుకున్న మన గ్రామాల్లోని ఆ మనుషులను.. ఎప్పటికీ మర్చిపోవద్దు" అని విజయ్ దేవరకొండ పోస్ట్ పెట్టారు. 1854 – 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రను రష్మిక పోషించారు. అజయ్ – అతుల్ సంగీతం సమకూర్చగా.. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'రణబాలి' చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని & వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.